కథ




# ఆర్తి చిత్రం

## మౌనప్రవాస్

**నేనొక గ్రాడ్యుయేట్‌ని. డిగ్రీ చేతికంది రెండు సంవత్సరాలయినా, ఇంకా నా ఉద్యోగ ప్రయత్నాలు కొనసాగుతూనే వున్నాయి. అవకాశాలన్నీ ఎండమావుల్లా ఊరించి, నిరాశా స్వప్నాల్లా చెదిరిపోతున్నాయి.**

రోజూ పేపర్లు చూడడం, అర్హమైన ఉద్యోగాలకు దరఖాస్తులు పెట్టడం, ఇంటర్వ్యూ కాల్ లెటర్స్ రావడం వంటి కార్యక్రమాలన్నీ యధావిధిగా వరుస క్రమంలో జరిగిపోతున్నాయి. అపాయింట్ ఆర్డర్స్ మాత్రం ఎవరెవరికో వెళుతున్నాయి.

ఈ రొటీన్ జీవితం నుంచి నన్ను వేరు చేసి, నాకు ఆత్మ సంతృప్తినిచ్చేది ఒకటుంది. అది చిత్రకళ.



చిత్రలేఖనమంటే నాకు చిన్నప్పటి నుంచీ ఎంతో ఆసక్తి. మిగతా ఏ క్లాసులకు వెళ్లినా, వెళ్లకపోయినా డ్రాయింగ్ క్లాసులకు మాత్రం ఠంచనుగా హాజరయ్యేవాడిని. నాకింకా గుర్తు. మొదటిరోజు మా డ్రాయింగ్

మాస్టారు జండా బొమ్మ వేసి, అందరినీ నోట్సుల్లో వేయమన్నారు. అందరి కంటే నేను బాగా వేసానని మెచ్చుకున్నారు. ఆ తరువాత మామిడిపండ్లు, ఇల్లు... అలా అన్ని బొమ్మలకూ ఆయన మెప్పును పొందాను.

ఆ కళలో నాకున్న ఆసక్తిని చూసి మా మాస్టారు నన్ను ఎంతో ప్రోత్సహించేవారు. ఒకసారి ఆయన చిత్రానికి, ఏదో బహుమతి వస్తే ముఖ్యమంత్రి చేతులమీదుగా దానిని అందుకున్నారు. అందరూ ఆయనను అభినందించేవారే. మా స్కూల్లో సన్మానం కూడా చేసారు. చిత్రలేఖనంలో నాకు ఆయనే స్ఫూర్తిగా నిలిచారు.

మొదట్లో బాపు బొమ్మలను చూసి అలాగే వెయ్యాలని ప్రయత్నించేవాడిని. ఆ తీరుకీ ఎంతో దూరంగా వున్నట్లుండేవి. కొంత కాలానికి ఎక్కడెక్కడో కాస్త పోలికలు కనిపించేవి. అలా వ్యంగ చిత్రానికి బాపు బొమ్మల్లా కాకపోయినా, నా శైలిలో కొంత నైపుణ్యం సాధించగలిగాను.

పత్రికలకు పంపే కార్టూనులేవీ ప్రచురింపబడేవి కావు. లోపం ఎక్కడుందో నాకర్థమయ్యేది కాదు. పట్టు విడువకుండా అలా పంపుతూ వుండేవాడిని. చివరకు ఒక మాసపత్రికలో నా కార్టూన్ వచ్చింది. ఆరోజు నా ఆనందానికి అవధులు లేవు. తరువాత నా కార్టూన్లు చాలా పత్రికల్లో వచ్చాయి.

కొన్నాళ్లకు మనుషుల రూపాలనూ, ప్రకృతి దృశ్యాలనూ చిత్రించే ప్రయత్నం మొదలుపెట్టాను. అది ఇంకా కష్టమనిపించేది. నా చదువును కూడా నిర్లక్ష్యం చేసి సమయమంతా దానికే వెచ్చించేవాడిని. అలా ఎంతో కృషి చేశాక, ఇప్పుడిప్పుడే ఆ విషయంలో అందరి మెప్పు పొందగలుగుతున్నాను.

నేను వేసిన వర్ణచిత్రాలను ఎన్నో మా స్నేహితులకూ, బంధువులకూ ఇచ్చాను. అవి చూసినప్పుడల్లా నేను వారికి గుర్తుకొస్తాను. నా గురించి చెప్పుకుంటారు. ఇది నాకెంతో గర్వకారణమనిపిస్తుంది. జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదురవుతున్నా నాకు ఊరటనిచ్చేది ఇది ఒక్కటే.

నిన్న ఒక ఇంటర్వ్యూకు వెళ్లివస్తుంటే పాత మిత్రుడొకడు కనిపించాడు. డిగ్రీలో మా క్లాస్‌మేట్ అప్పుడు మాకు. కల్చరల్ సెక్రటరీగా వుండేవాడతను. చాలా కాలమయింది అతన్ని చూసి.

పరస్పర వివరాలన్నీ అడిగి తెలుసుకున్నాం. నా ప్రయత్నాల గురించి చెప్పాను. అతడొక ప్రైవేట్ కంపెనీలో చేస్తున్నాడట. కొందరి స్నేహితుల సహయంతో ఈ మధ్యనే అతడు నెలకొల్పిన సాంస్కృతిక సంస్థ గురించి చెప్పాడు. ఆ సంస్థ పేరు కళాంజలి. ఈ పేరు నేను విన్నదే.

కళాంజలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబడిన చిత్రలేఖనం పోటీ గురించి నాకప్పుడే తెలిసింది. ఈ పోటీని రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్నారు. చిత్రాలు అందజేయవలసిన గడువు ఈనాటితో అయిపోయింది.

నా హాబీ గురించి అతడికి ముందే తెలుసు కాబట్టి. నన్ను కూడా తప్పకుండా ఈ పోటీలో పాల్గొనమని చెప్పాడు. అతని వద్ద ఆ సంస్థ చిరునామా తీసుకున్నాను.

నిన్న అంతా జరిగిన ఇంటర్వ్యూ గురించే నా ఆలోచన. రాత్రి నుండీ ఎందుకో అంత బాగాలేదు. కొంచెం తలనొప్పిగా కూడా వుండడంతో పెందరాళే నిద్రపోయాను.

ఈవాళ ఉదయం నుంచీ కేన్వాసు, పెన్సిల్స్, రంగులు అన్నీ ఎదురుగా పెట్టుకొని కూర్చున్నాను. ఏ బొమ్మ గీయాలి? మామూలుగా అయితే నా చేతికి ఏ బొమ్మ వస్తే ఆ బొమ్మ గీసేవాడిని. కానీ మొదటిసారిగా నా చిత్రం ఒక పోటీలో పాల్గొనబోతోంది. ఇది ఎలా వుండాలి? ఇంతకు ముందు నా నుంచి వచ్చిన చిత్రాలన్నీ నా అభిరుచులకు తగిన పరిధుల్లో వున్నవే తప్ప, పరిసరాలను గానీ, సమాజాన్ని గానీ స్పృశించినవి కావు. ఈసారి నేను గీయబోయేది ఒక సామాజిక స్పృహ వున్న చిత్రం కావాలని నిర్ణయించుకున్నాను. కానీ, ఒక్క ఆలోచనా రావడం లేదు.

అంతలో 'బాబూ ధర్మం....' అంటూ ఒక కంఠం వినిపించింది. తల ఎత్తి చూసాను. అతడే! ఆ బిచ్చగాడిని రోజూ చూస్తునే వున్నాను. రోడ్డు పక్కనే కూర్చుని దారినిపోయిన వాళ్లను అడుక్కుంటాడు. ఎక్కడ నుంచి వచ్చాడో... గత వారం రోజుల నుంచీ అనుకుంటాను. నా కిటికీ తలుపులు తీసి చూస్తే ఎదురుగా కనిపిస్తున్నాడు.

ఈ సమయంలో వాడు రావడం చిరాకు అనిపించింది.

'చిల్లర లేదు వెళ్లు...' అని కోపంగా అన్నాను.

''రెండు రోజుల నుండీ...'' ఏదో అనబోయాడు.

''వెళ్లమంటుంటే...'' అని ఇంకా గట్టిగా అరిచాను. కొంచెం మూలుగుతూ వెళ్లిపోయాడు.

కిటికీ లోంచి వచ్చిపోయే వాహనాల వంక చూస్తూ, ఆలోచిస్తున్నాను నేను.

వాడు మళ్లీ రోజూ కూర్చునే చోటు దగ్గరికే చేరి, అక్కడ గుడ్డ పరుచుకున్నాడు. దారిన పోయే వారందరి దగ్గరా చేతులు చాస్తూ వేడుకుంటున్నాడు.

అప్పుడు వాడిని పరిశీలనగా చూసాను. ఎండిపోయిన జుత్తు, చిరిగిపీలికలయిన బట్టలు...ముడతలు పడ్డ శరీరం...

వీటినే నేనెందుకు చిత్రీకరించకూడదు?

ఆ ముఖంలో కనపడుతున్న దైన్యం...

అదే నా చిత్రానికి ఊపిరెందుకు కాకూడదు?

ఈ ఆలోచన రాగానే పెన్సిల్ అందుకుని బిచ్చగాడి అవుట్ లైన్స్ గీయడం ప్రారంభించాను.

వాడు ఆశగా అందరి వంకా చూస్తూ అరుస్తున్నాడు. కానీ ఒక్కరూ వాడి వంక చూడకుండా ముందుకు సాగిపోతున్నారు.

కలర్ బాక్స్ తీసుకొని కుంచెతో చకచకా రంగులు వేస్తున్నాను. చిత్రం బాగానే వస్తోంది.

అప్పటికీ సమయం మధ్యాహ్నం పన్నెండు గంటలయింది. ఎండ తీవ్రంగా కాస్తోంది. పనుల సందడితో వడివడిగా పరుగులు తీస్తున్న జనావళి మధ్యలో వాడింకా అలాగే మూలుగుతున్నాడు. స్వరంలో మార్పు వచ్చింది.

పరుగులాంటి నడకతో వెళ్లి చూసాను. నీరసంతో కళ్లు తేల వేస్తూ బిచ్చగాడు కనిపించాడు. ఎవరో వాడి ముఖం మీద నీళ్లు చల్లుతున్నారు. అందరూ చూస్తుండగానే కదలికలు ఆగిపోయాయి.

నేను రంగులు వేయడం కూడా పూర్తయింది. చిత్రం వంక ఒకసారి చూసాను.సంతృప్తికరంగానే వచ్చింది. అప్పటి వరకూ నేను పడిన శ్రమనంతా మరిచిపోయాను.

రూమ్ నుంచి బయటపడి భోజనం చేసాక, కళాంజలి సంస్థ చిరునామా వెతుక్కుంటూ వెళ్లాను. తేలిగ్గానే దొరికింది. అక్కడ నా చిత్రాన్ని అందజేసాను. మర్నాటి ప్రదర్శనకు నా చిత్రాన్ని అనుమతించింది, బహుమతులు ఎల్లుండి ప్రకటిస్తామని చెప్పారు నిర్వాహకులు.

హుషారుగా నడుచుకుంటూ గదికి వచ్చాను. ఎదురుగా ఏదో కలకలం వినిపిస్తే అటు చూసాను. అది ఆ బిచ్చగాడు కూర్చునే స్థలం! ఎందరో మనుషులు మూగి వున్నారక్కడ. నాకు ఏమైందో అర్థం కాలేదు.

పరుగులాంటి నడకతో వెళ్లి చూసాను. నీరసంతో కళ్లు తేలవేస్తూ బిచ్చగాడు కనిపించాడు. ఎవరో వాడి ముఖం మీద నీళ్లు చల్లుతున్నారు. అందరూ చూస్తుండగానే కదలికలు ఆగిపోయాయి. దేహం నిర్జీవమైంది. కొద్ది నిమిషాల్లోనే శవాన్ని అక్కడి నుంచి తరలించారు.

గదికొచ్చి మంచంమీద చతికలపడ్డాను. ఇప్పుడు కిటికీ తలుపులు తెరిచి చూస్తే ఆ బిచ్చగాడు మరి ఇక కనిపించడు. ఆ రూపం అలా ఇంకా నా కళ్లల్లో కదలాడుతూనే వుంది.

రాత్రి అయింది. ఏమీ తినాలనిపించడంలేదు. నిద్ర పోవడానికి ప్రయత్నిస్తున్నాను. అయినా నిద్ర పట్టడం లేదు.

ఆకలిచావు బలిగొన్న ఆ అనాధ శవం నాలోని సామాజిక స్పృహను నిజజీవితంలో ప్రదర్శించలేకపోయాను. నేను చేసిందేమిటి? ఒక కళాకారుడిగా ఆ బిచ్చగాడి రూపానికి ఊపిరి పోసాను. కానీ ఒక మనిషిగా?...

నాచే రూపుదిద్దుకున్న చిత్రానికి తను స్ఫూర్తి కాగలిగాడు. కానీ అతని జీవితాన్ని నిలిపే చిన్న సహాయం తాను చేయలేకపోయాడు. అలా తాను చేయగలిగే కనీసం సహాయం ఆ సమయానికి చేసి వుంటే అతను బతికే వాడేమో... ఈ లోకంలో బ్రతకడానికి చేయూత లేక అల్లాడిపోతున్న ప్రాణిని తాను బలవంతంగా మరణ గర్భంలోకి తోసినట్లనిపిస్తోంది.

వారం తరువాత పోటీ ఫలితాలు ప్రకటించారు. ప్రథమ బహుమతి నాకే వచ్చింది.బహుమతి ప్రదానంలో ఆ ప్రశంసలు, చప్పట్ల మధ్య... ఒక కళాకారుడిగా నేను సాధించిన ఉన్నతి కంటే మనిషిగా నేను దిగజారిపోయిన లోతే స్పష్టంగా కనిపించింది. నా గదిలో పదిలపరచబడ్డ ఆ చిత్రంలోని బిచ్చగాడి చూపులు నన్నేదో అడుగుతున్నట్లుంటాయి, ★